

బాల్యం..బలహీనం..!

- జిల్లా వ్యాప్తంగా పిల్లల్లో పౌష్టికాహార లోపం
- వయస్సుకు తగ్గట్లు ఎదుగుదల లేనివాళ్లు 15 వేల మంది
- స్పష్టంగా కానవస్తున్న అధికారుల పర్యవేక్షణ లోపం

నేటి బాలలే రేపటి పౌరులు. ఈ దేశం వారిదే. వారి భవిష్యత్తు బాగుంటే దేశం బాగుంటుందని అంటారు. అందుకని ప్రభుత్వాలు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నాయి. అయితే ఈ చర్యలు క్షేత్ర స్థాయిలో సరిగా అమలు కావడం లేదు. వయసుకు తగ్గట్టు పిల్లలు ఎదగడం లేదు. వేల సంఖ్యలో పిల్లలు పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. ఇటీవల వెలువడిన ప్రపంచ ఆకలి సూచీ - 2024లో మన దేశం 105వ స్థానంలో నిలిచింది. ఈ దుస్థితి జిల్లాలో కూడా చాలా స్పష్టంగా కనిపిస్తోంది.



నంద్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎత్తుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ ఎత్తు లేక, పోషకాహార లోపంతో బాధపడుతూ మరణిస్తున్న ఐదేళ్ల లోపు పిల్లల సంఖ్య ఆధారంగా తయారైన ఆకలి సూచీ - 2024 వెలువడింది. దీని ప్రకారం జిల్లాలో బాలల పరిస్థితిని పరిశీలిస్తే ఐదేళ్ల లోపు పిల్లల మరణాల అంశంలో తప్పించి మిగిలిన మూడింట క్షేత్రస్థాయి పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఐదేళ్ల లోపు పిల్లలు 1,12,460 మంది ఉన్నారు. వీరిలో వయసుకు తగ్గ ఎదుగుదల లేని పిల్లల సంఖ్య 14,920. ఇది మొత్తం సంఖ్యలో 13.3 శాతం. పోషకాహార లోపంతో బాధపడుతున్న వారి సంఖ్యను పరిశీలిస్తే 12,087 మంది ఉన్నారు. శాతం పరంగా చూస్తే 10.77 శాతంగా కనిపిస్తోంది. సంఖ్యాపరంగా చూసుకున్నా, శాతం పరంగా చూసుకున్నా ఈ స్థాయిలో పిల్లలు బలహీనంగా ఉన్నారంటే అధికారులు పౌష్టికాహారాన్ని అందించటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలు శాతం పరంగా 2.94 శాతం ఉన్నా, సంఖ్య పరంగా చూసుకుంటే 3301 మంది ఉన్నారు. ఇక ఐదేళ్ల లోపు పిల్లల మరణాల సంఖ్య మాత్రమే పరిగణలోనికి తీసుకోవాల్సిన అవసరం లేని విధంగా ఉంది. జిల్లా శిశు, మహిళా సంక్షేమ శాఖ ఎప్పటికప్పుడు తాము మెరుగైన పనితీరు కనబరుస్తున్నామని చెబుతున్నారు. కానీ పై అంశాలను పరిశీలిస్తే వారి పనితీరు ఏ విధంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● పట్టించుకోవటం లేదా..?

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 3,549 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, నంద్యాల జిల్లాలో 1663 ఉన్నాయి. వీటితో పాటు మినీ అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ఉన్నాయి. నంద్యాల జిల్లా వరకు చూసుకుంటే 5 ఏళ్లలోపు పిల్లలతో పాటు గర్భిణులు 11,967 మంది, బాలింతలు 10,665 మంది ఉన్నారు. వీరికి పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రాల నుంచే అందుతున్నది. వాస్తవానికి అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పౌష్టికాహారం తీసుకునే వారి సంఖ్య ఎంత అనేది స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారానికి ప్రభుత్వం నెలకు దాదాపు రూ.75 లక్షల పైనే ఖర్చు చేస్తున్నట్లు అంచనా! ప్రభుత్వం పథకం ప్రవేశపెట్టినా దానిని ప్రజల్లోనికి బలంగా తీసుకువెళ్లాల్సింది అధికారులే! ఈ విషయంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



పాణ్యంలోని అంగన్వాడీ కేంద్రం

● చెంచుగూడేల్లో మరింత అధ్వానం..

నంద్యాల జిల్లాలో దాదాపు 46 చెంచుగూడేలు ఉన్నాయి. పోషకాహార లోపం, తదితర అంశాలకు సంబంధించి ఎక్కువ సమస్యలు ఇక్కడే ఉన్నాయన్న విమర్శలున్నాయి. ఈ గూడేలలో నిరక్షరాస్యత, బాల్య వివాహాలు, అనారోగ్యం, పేదరికం, అవగాహన లేమి మొదలైనవి పిల్లల్లో పోషకాహార లోపానికి కారణాలు అని తెలుస్తున్నాయి. మహిళలు చిన్న వయసులోనే గర్భం దాల్చితే నెలలు నిండకుండానే ప్రసవించే ప్రమాదం ఉంది. ఇలా పుట్టిన పిల్లలు అనేక రుగ్మతలతో ఇబ్బందులు పడుతుంటారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో కూలీ పనులు చేసే వారు పేదరికం, నిరక్షరాస్యత, అవగాహన లేక చిన్నారులకు పోషకాహారం అందడం లేదు. వలస కూలీల పిల్లల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితులున్న చోట అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ అధికారులు పర్యవేక్షణ సక్రమంగా ఉండాలి. కానీ చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన ఆహారాన్ని అందటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లోని అవగాహన కల్పించటంలో విఫలమవుతున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది.

● పక్కదారి పడుతున్నాయి..

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆహార పదార్థాలు సక్రమంగా అందుతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చాలాచోట్ల పిల్లలకు కేవలం అన్నం, పప్పు మాత్రమే ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక గుడ్లు కూడా రోజూ పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక చాలా చోట్ల సరుకులు పక్కదారి పడుతున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. అంగన్‌వాడీ సెంటర్లకు వచ్చే నూనె నుంచి చిక్కీలు, పాల ప్యాకెట్ల వరకు అక్కడి వారు అమ్ముకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక చాలా కేంద్రాల్లో నమోదైన పిల్లల సంఖ్యకు వాస్తవ సంఖ్యకు తేడా ఉంటోందని, నమోదైన సంఖ్య పరంగా వచ్చే పదార్థాలను అమ్ముకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాల్సిన అధికారులు సక్రమంగా పట్టించుకోకపోవటంతో ఇలా జరుగుతోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. వెరసి పిల్లల ఎదుగుదల ప్రమాదంలో పడిపోయింది. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పిల్లలకు పోషకాహారం సక్రమంగా అందేలా చూడాల్సిన అవసరం ఉంది.

జాతీయ సైన్సు, సాహిత్య సదస్సుకు కుమార్‌బాబు



బనగానపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వీరబోయిన కుమార్‌బాబు యాదవ్ జాతీయ సైన్సు, సాహిత్య సదస్సుకు ఎంపికయ్యారు. సామాన్య ప్రజలకు శాస్త్రీయ విజ్ఞానాన్ని దగ్గరకు చేర్చే ఉద్దేశంతో భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ నవంబరు 30 నుంచి డిసెంబరు 3వతేదీ వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతి ఐఐటీలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇంటర్నేషనల్ సైన్సు ఫెస్టివల్ 2024కు రాయలసీమ రీజన్ నుంచి పర్యావరణ సమన్వయకర్త కుమార్‌బాబు యాదవ్ ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా సైన్సు కథల రచయితలను ఈ కార్యక్రమానికి ఎంపిక చేస్తారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల నుంచి ఇద్దరికి స్థానం దక్కగా ఇందులో కుమార్‌బాబు ఎంపిక కావడం విశేషం.

కేఎంసీని కాపాడుకుంటాం

రోడ్డెక్కిన జూనియర్ డాక్టర్లు ● కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ



6లో

తిరుమల తరహాలో శ్రీశైలం అభివృద్ధి

● కలెక్టర్ రాజకుమారి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రాన్ని తిరుమలలా అభివృద్ధి చేసేందుకు సమగ్ర వివరాలతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయడానికి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో శ్రీశైల మహాక్షేత్ర అభివృద్ధిపై జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. గతంలో దేవదాయ, అటవీశాఖలు సంయుక్తంగా నిర్వహించిన సర్వే నివేదికలను కూడా పొందుపరచాలని సర్వే లాండ్స్ ఏడీని ఆదేశించారు. నందికొట్కూరు రిజర్వ్ ఫారెస్ట్, వన్యప్రాణుల నిషేధిక భూములు సంబంధిత వివరాలతో నివేదికలు ఇవ్వాలని డీఎఫ్‌ఓను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకరంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్న నేపథ్యంలో శ్రీశైల క్షేత్రాన్ని తిరుమల స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించి నివేదికలు పంపాలని గత సోమవారం ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన దేవదాయ, పర్యాటక, ఆర్‌అండ్‌బీ మంత్రుల కమిటీ సమావేశంలో నిర్దేశించారన్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైల దేవస్థానం ఆధీనంలో వున్న భూములు, అటవీ సరిహద్దులు నుండి రక్షణగోడలు మొదలైన వాటిపై నివేదకలను అందజేయాలని శ్రీశైల దేవస్థానం ఈవో చంద్రశేఖర అజాద్‌ను కలెక్టర్ ఆదేశించారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయండి

జిల్లాలో ప్రారంభించిన సీసీ రోడ్ల నిర్మాణ పనుల పూర్తికి నాలుగు వారాలు మాత్రమే సమయం వుందని నాణ్యత ప్రమాణాలు పాటించి మండలాల వారిగా కేటాయించిన లక్ష్యాన్ని పూర్తిచేయాలని కలెక్టర్ రాజకుమారి పంచాయతీరాజ్ ఇంజనీర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీసీ రోడ్ల నిర్మాణ పనుల ప్రగతిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 240 రోడ్లకు గాను 41, నంద్యాల నియోజకవర్గంలో 103 రోడ్లకుగాను 27, పాణ్యం నియోజకవర్గంలో 71రోడ్లకు గాను 15, శ్రీశైలం నియోజకవర్గంలో 165 రోడ్లకు గాను 57, బనగానపల్లి నియోజకవర్గంలో 147రోడ్లకు గాను 33, డోన్ నియోజకవర్గంలో 64రోడ్లకు గాను 27, నందికొట్కూరు నియోజకవర్గంలో 236 రోడ్లకుగాను 55 పూర్తయ్యాయన్నారు. మిగిలిన రోడ్ల నిర్మాణాలను డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని ఏఈ, డీఈలను కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశించిన రోడ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

విద్యుత్ అధికారులతో మంత్రి ఫరూక్ సమీక్ష



విద్యుత్ అధికారులలో సమీక్షిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారులతో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూ గురువారం రాత్రి సమీక్ష నిర్వహించారు. బొమ్మలసత్రం, నూనెపల్లె, వీవీ నగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. పట్టణంలోని విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఇండోర్, అవుట్ డోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు 15 నుంచి 40 సెంట్ల మేర స్థలాలు గుర్తించాలని నంద్యాల తహసీల్దార్ ప్రియదర్శిని, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి ఆదేశించారు. ప్రధానంగా హైవోల్టేజి, లోవోల్టేజి సమస్య పాత పట్టణంలో ఎక్కువగా ఉందని, అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్‌కుమార్, ఈఈ శ్రీనివాసులరెడ్డి, పట్టణ డీఈఈ రమేష్‌కుమార్, ఏఈలు రామయ్య, శ్రీనివాసులు, రవికుమార్, తహసీల్దార్ ప్రియదర్శిని, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీజీ ప్రధాన కాల్వకు నీరు నిలిపివేత



తెలుగుగంగ ప్రధాన కాల్వ

రుద్రవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగు గంగ ప్రధాన కాల్వకు (చెన్నై కాల్వ)కు ఉన్నతాధికారులు గురువారం నీటి సరఫరా నిలిపివేశారు. డిసెంబరు నెలలో ఐఏబీ సమీక్ష సమావేశంలో నిర్ణయం జరిగాక రబీ సీజనుకు నీరు విడుదల చేయాలనే ఆలోచనలో ఇరిగేషన్ అధికారులు ఉన్నట్లు సమాచారం. ఏది ఏమైనా తెలుగుంగ ప్రధాన కాల్వ నీటి సరఫరాను నిలిపివేశారు. ఈ విషయం తెలుగుగంగ డీఈ చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుగంగ ప్రధాన కాల్వకు నీటి సరఫరా నిలిపివేశారు. వెలుగోడులో 12 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. నీటిని వారబందీ ప్రకారం విడుదల చేసే దిశగా ఐఏబీ సమీక్ష ఉన్నతాధికారులు నిర్వహిస్తారని తెలిపారు.




ట్రాక్టరు సాయంతో మిరప పంట దున్నుతున్న రైతు తిరుమలేశ్వర్‌రెడ్డి

మిరప పంట దున్నివేత

ఎన్నో ఆశలతో అప్పులు చేసి సాగు చేసిన పంటలను రైతులు దున్నేస్తున్నారు. ఉయ్యాలవాడ మండలంలోని తుడుములదిన్నె గ్రామానికి చెందిన కర్నాటి తిరుమలేశ్వర్‌రెడ్డి గురువారం ఆరు ఎకరాల్లోని మిరప పంటను దున్నేశాడు. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంతో పంటకు తెగులు సోకి మొత్తం పూర్తిగా దెబ్బతింది. దీంతో పంటను కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయం లేకపోయింది. దీంతో చేసేదేమీ లేక మూడు నెలల పంటను ట్రాక్టర్‌తో దున్నేశాడు. రైతు ఎకరాకు కౌలుతో కలిపి రూ.2లక్షల పెట్టుబడి పెట్టాడు. పంట తెగులు కారణంగా రైతుకు మొత్తం రూ.12లక్షల మేర నష్టం వాటిల్లింది.

- ఉయ్యాలవాడ(ఆంధ్రజ్యోతి)

క్రైం నేరాలపై కాల్ చేయండి



గొడుగులతో విద్యార్థుల వినూత్న ప్రదర్శన

నేరాల నియంత్రణలో పోలీసులు నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తున్నారు. అందులో భాగంగానే గురువారం నంద్యాల జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో వరల్డ్ విజన్ ఇండియా నంద్యాల ప్రాంతీయ అభివృద్ధి సంస్థవారు ఇలా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రదర్శించారు. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం 137 మంది విద్యార్థులు గంటసేపు 137 గొడుగులతో 1930 ఆకారంలో కూర్చుని ఇలా ప్రదర్శించారు. గొడుగులతో ఇలా వినూత్నంగా 1930 నంబర్‌పై అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా విద్యార్థులను సీఐలు మారుతీశంకర్, ఇస్మాయిల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ విజన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ తిరుపతిరావు, మదర్‌సొసైటీ ఫౌండర్ రామారావు, డాక్టర్ శారదాబాయి తదితరులు పాల్గొన్నారు.

- నంద్యాల క్రైం(ఆంధ్రజ్యోతి)

'ఆంధ్ర కళాదర్శిని'లో కోటేష్ చిత్రాలు







నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ వేసిన చిత్రాలు, రచనలు ఆర్ట్ ఆఫ్ ఏపీ ఆంధ్రకళాదర్శినిలో చోటు సంపాదించుకున్నాయి. ఆంధ్ర కళాదర్శిని ఎడిటర్ కళాసాగర్ తెలుగు సంస్కృతి, కళావైభవాన్ని గుర్తింపు తేవాలనే తపనతో 368 మంది కళాకారులను గుర్తించి వారు వేసిన కళాఖండాలు ఈ పుస్తకంలో పొందుపరచారు. ఆనాటి ప్రసిద్ధ చిత్రకారులు దామెర్ల రామారావు, బాపు, వడ్డాది పాపయ్య, అడవిబాపిరాజు తదితరుల చిత్రాలను ఇందులోకి తీసుకున్నారు. అట్లాగే తన చిత్రాలకు కూడా ఈ పుస్తకంలో ఒక పేజీ కేటాయించినట్లు చిత్రకారుడు కోటేష్ తెలిపారు. ఈ పుస్తకావిష్కరణ డిసెంబర్ 8న హైదరాబాదులోని జెఎన్‌టియూ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో ఉంటుందని కోటేష్ తెలిపారు.

-నంద్యాల కల్చరల్ (ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు : మంత్రి



బనగానపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే సంక్రాంతి పర్వదినానికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లను ప్రజలు చూస్తారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వెల్లడించారు. గురువారం ఆయన బనగానపల్లెలో రోడ్ల పనులపై మాట్లాడారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న రోడ్ల మరమత్తు పనుల తీరును పర్యవేక్షించేందుకు జిల్లాల పర్యటనకు స్వయంగా వెళ్తానని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న వివిధ రహదారుల మరమత్తు పనులకు తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. రహదారుల మరమతుల పనుల్లో భాగంగా నిత్యం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. గత వైసీపీ పాలనలో అప్పటి సీఎం జగన్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు రహదారుల వ్యవస్థను నాశనం చేశారన్నారు. కనీసం రోడ్లకు మరమ్మతులు కూడా చేయకుండా ప్రజలను ఇబ్బందుల పాలు చేశారని ఆరోపించారు.



మనదేశం సంప్రదాయ కళలకు పుట్టినిల్లు. ఇక్కడ పుట్టిన కళలకు విశేష ఆదరణ ఉంది. 64 రకాల లలిత కళల్లో ఎందరో తమ ప్రతిభను కనబరుస్తూ ఉన్నారు. ఇందులో భాగంగానే చిత్రలేఖనంలో కూడా చాలా మంది రాణిస్తున్నారు. వీరిలో కేరళకు చెందిన రాజా రవివర్మ 18వ శతాబ్దంలోనే చిత్రలేఖనంలో అద్భుతాలు కళాఖండాలను సృష్టించారు. వీరినే ఆదర్శంగా తీసుకున్న ఆత్మకూరుకు చెందిన షేక్‌మహ్మద్‌షఫి (చిన్ని) చిత్రలేఖనం కళపై తన ఆసక్తిని చాటుకున్నాడు. 1992లో పాణ్యంలో ఇంటర్మీడియట్ ఫెయిల్ అవడంతో షఫికి ఏం చేయాలో దిక్కుతోచలేదు. తనకు చిన్నతనం నుంచే పెయింటింగ్ పట్ల మక్కువ ఉండటంతో 79 ఏళ్ల రిటైర్డు డ్రాయింగ్ మాస్టర్ కంబగిరి రాజు వద్దకు వెళ్లి తనకు డ్రాయింగ్ నేర్పించాలని కోరాడు. తనకు వయస్సు మళ్లిందని, నేర్పించడం చేతకావడం లేదని మాస్టారు చెప్పినా బతిమిలాడి మరీ చిత్రలేఖనంలో శిక్షణ పొందాడు. తొలుత కాగితాలపై పెన్సిల్‌తో బొమ్మలు గీయడం నేర్చుకున్నాడు. ఆ తర్వాత రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు వెళ్లి చిత్రలేఖనంలో మరెన్నో మెలకువలు నేర్చుకున్నాడు. అనంతపురం జిల్లాలోని గుంతకల్లులో కట్‌ఔట్స్‌పై పెయింటింగ్ వేయడం, హైద్రాబాద్‌లో 400 అడుగుల సైజ్‌గల బోర్డులపై బొమ్మలు వేయడం, అక్షరాలు రాయడం నేర్చుకున్నాడు. విజయవాడ, గుంటూరులలో ఔట్‌డోర్ పబ్లిసిటీ వర్క్‌లను కూడా ఆకళింపు చేసుకున్నాడు. దాన్నే ఉపాధిగా ఎంచుకున్నాడు.

ఆత్మకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):

ఆర్ట్



కళతోనే ఉపాధి : పాణ్యంలోని రిటైర్డు పోస్టుమాస్టర్ ఖాశీం, షేకున్‌బీ దంపతుల కుమారుడైన షఫి ఇంటర్ ఫెయిల్ అవడంతో తన తల్లిదండ్రులు ఏదో ఒక పని చూసుకోమని సూచించారు. అయితే డ్రాయింగ్ పట్ల షఫి ఆసక్తి చూపగా అందుకు తల్లిదండ్రులు నిరాకరించారు. వారు వద్దనా వినకుండా అందులోనే తన ఉపాధిని పదిలపర్చుకున్నాడు. 2000 సంవత్సరంలో ఆత్మకూరులో వివాహం చేసుకోవడంతో ఇక్కడే చిన్ని ఆర్ట్స్ షాప్‌ను ప్రారంభించి తన కళతోనే సంపాదన వైపు దృష్టి సారించాడు. అప్పట్లో గ్రాఫిక్స్‌తో కూడిన ఫ్లెక్సీలు లేకపోవడంతో ఎనామిల్, వాటర్ కలర్స్, ఆయిల్ పెయింటింగ్‌తో తయారయ్యే బ్యానర్లు, ఇతర పెయింటింగ్ వర్కులకు విశేష ఆదరణ ఉండేది. ప్రతిరోజూ తీరిక లేనంత పని ఉండేది. అయితే సాంకేతికరంగం అభివృద్ధిలో భాగంగా డిజిటల్ రంగం అభివృద్ధి చెంది గ్రాఫికల్ ఫ్లెక్సీలు అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం చేతి రాతతో కూడిన బ్యానర్లకు ఆదరణ తగ్గింది. దీంతో 2015లో చిన్ని ఆర్ట్స్‌ను మూసివేసి అవకాశం దొరికినప్పుడులా డ్రాయింగ్ పనులను చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.



నల్లమల అటవీ ప్రాంతంలో బోర్డులపై బొమ్మలు వేస్తున్న ఆర్టిస్టు చిన్ని

కుంచె కదిపితే అద్భుతాలే...!

- చిత్రలేఖనంలో విశేష ప్రతిభ
- కళలో ఉపాధిని ఎంచుకున్న వైనం

అటవీ శాఖలో అందివచ్చిన అవకాశాలు

చిత్రలేఖనంలో అద్భుత ప్రతిభను సొంతం చేసుకున్న షఫికి ఆత్మకూరు అటవీశాఖ అధికారులు ఎన్నో అవకాశాలను కల్పించారు. డ్రాయింగ్‌లో చిన్ని ట్యాలెంట్‌ను గుర్తించి 2005లో అప్పటి ఆత్మకూరు డీఎఫ్‌వో అశోక్‌కుమార్ అటవీశాఖ పరిధిలో ఏర్పాటు చేసే వివిధ సూచిక బోర్డులపై చిత్రాలతో కూడిన రాతలు రాయించారు. అందరూ అభినందించే రీతిలో చిన్ని అటవీశాఖ బోర్డులపై అద్భుతమైన కళాఖండాలను జాలువార్చడంతో అప్పటి నుంచి నేటి వరకు అటవీశాఖలో ప్రతి పెయింటింగ్‌ను చిన్నితో వేయిస్తున్నారు. చిన్ని వేసే బొమ్మలన్నీ జీవం ఉట్టిపడేటట్లుగా ఎంతో ఓపికతో తన కళను ప్రతిబింబిస్తున్నాడు. ఏ చిన్న పొరపాట్లకు తావివ్వకుండా గ్రాఫికల్‌తో తయారైన డిజైన్‌గా భావించేట్టుగా తన చిత్రలేఖన ప్రతిభను కనబరుస్తున్నాడు. ఆత్మకూరు డివిజన్‌లోని నాగలూటి, బైర్లూటి, ఆత్మకూరు, శ్రీశైలం, వెలుగోడు రేంజ్‌లో వందలాది బోర్డులపై వన్యప్రాణులు, పక్షుల బొమ్మలను వేసి వాటిపై సూచికలను పొందుపరుస్తున్నాడు. చిన్ని ప్రతిభను గుర్తించిన మార్కాపురం అటవీ డివిజన్ వారు సైతం చిన్నితో తమ డివిజన్ పరిధిలో కూడా వన్యప్రాణుల, పక్షి బొమ్మలను వేయించేలా అవకాశం ఇస్తున్నారు. కాగా చిన్ని గురించి తెలుసుకున్న నెల్లూరులోని నేలపట్టు, పులికాట్ సరస్సు తదితర ప్రాంతాల వారు కూడా చిన్నిని పిలిపించుకుని తమ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే సూచిక బోర్డుల్లో పక్షుల బొమ్మలను గీయించుకుంటున్నారు. ఇలా తన కళతో చిత్రలేఖన కళాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కర్నూలు - గుంటూరు అటవీ రహదారిపై చిన్ని వేసిన చిత్రాలు పర్యాటకుల్ని, ప్రయాణికుల్ని ఎంతో ఆకట్టుకుంటున్నాయి.





భారతీయ సంప్రదాయాల్లో లలితకళలకు విశేష ఆదరణ ఉండేది. అలాంటిది నేడు కళల పట్ల ఆదరణ కరువవుతోంది. వీటిలో చిత్రలేఖనం పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. గ్రాఫికల్ టెక్నాలజీ కూడిన ఫ్లెక్సీల తయారీ జరుగుతుండటంతో చాలా మంది పెయింటింగ్‌తో కూడిన చిత్రాలు, వాల్ రైటింగ్స్, బ్యానర్లు తదితర వాటిపై ఆసక్తి

చిత్రలేఖనం కళకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలి

చూపడం లేదు. తక్కువ ధరలకే ఫ్లెక్సీలు తయారవుతుండటంతో జనం వాటిపైనే మక్కువ చూపుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వాలు కూడా డ్రాయింగ్ టీచర్ల నియామకం చేపట్టడం లేదు. దీంతో చిత్రలేఖనంలో రాణించాలన్న కోరిక కూడా నేటి తరంలో లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాయింగ్ టీచర్ల నియామకం చేపట్టేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.



- షేక్‌మహ్మద్‌షఫి(చిన్ని), ఆర్టిస్ట్, ఆత్మకూరు

లోటుపాట్లు లేకుండా సాగు నీటి సంఘాల ఎన్నికలు జరపండి



కర్నూలు కలెక్టరేట్ నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో లోటుపాట్లు లేకుండా పటిష్టంగా సజావుగా చేపట్టాలని జలవనరుల శాఖ స్పెషల్ సీఎస్ జి. సాయిప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ కార్యాలయం నుంచి సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ అంశంపై కలెక్టర్లతో జలవనరుల శాఖ స్పెషల్ సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ సీఎస్ సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై డివిజన్ స్థాయిలో శిక్షణా తరగతులు నిర్వహించాలని, సజావుగా ఎన్నికలను నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని స్పెషల్ సీఎస్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. డిసెంబరు 5వ తేదీన నోటిఫికేషన్ ఇస్తామని తెలిపారు. డిసెంబరు 8వ తేదీన ప్రాదేశిక నియోజకవర్గం వాటర్ యూజర్స్ అసోసియేషన్‌కు ఎన్నికలు ఉంటాయని, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 11వ తేదీన ఎన్నికలు, ప్రాజెక్ట్ కమిటీలకు 14వ తేదీన ఎన్నికలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అధికారుల నియామకం పూర్తి చేశామన్నారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, జలవనరుల శాఖ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, డీఈలు పాల్గొన్నారు.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు

- నిబంధనల సడలింపు ● ఫలించిన సీఎం విజ్ఞప్తి



పెంచికలపాడు కేంద్రంలో పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న సెక్రటరీ సుందర్‌రాజు, సూపర్‌వైజర్ శ్రీను

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలులో భారత పత్తి సంస్థ (సీసీఐ) నిబంధనల వల్ల రైతులు పత్తిని అమ్మలేక, దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. ఈ పరిస్థితిని నివారించేందు కోసం నిబంధనలను సడలించాలని సీఎం చంద్రబాబునాయుడు ఇటీవల వ్యవసాయ శాఖ కేంద్ర మంత్రికి లేఖ రాశారు. దీంతో రెండు రోజుల కింద కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో సీసీఐ సంస్థ అధికారులు నిబంధనలను సడలించినట్లు కర్నూలు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణ మూర్తి విలేకరులకు తెలిపారు. కర్నూలు జిల్లాలో 12 సీసీఐ కేంద్రాలను ఏర్పాటయ్యాయని, ఇప్పటి దాకా 3,181 మంది రైతుల నుంచి 4,704 లక్షల విలువ చేసే 63,924 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు ఏడీఎం నారాయణ మూర్తి తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవగాహన కల్పించి, సడలించిన నిబంధనల మేరకు రైతుల నుంచి సీసీఐ అధికారులు పత్తిని కొనుగోలు చేసేలా మార్కెట్ కమిటీల సెక్రటరీలు, సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలని ఆదేశించామన్నారు.

కేఎంసీని కాపాడుకుంటాం

- రోడ్డెక్కిన జూనియర్ డాక్టర్లు
- సంఘీభావం ప్రకటించిన ఏపీజీడీఏ
- కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'కర్నూలు మెడికల్ కళాశాల మాది.. ఈ కాలేజీని కాపాడుకోవడం మా హక్కు. ప్రాణాలైనా అర్పించి కేఎంసీ స్థలాన్ని కాపాడుకుంటాం..' అంటూ జూనియర్ డాక్టర్లు గర్జించారు. కర్నూలు మెడికల్ కాలేజీకి సంబంధించిన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ ఏపీ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్, ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ)ల ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులు బుధవారం కాలేజీ ప్రవేశ ద్వారం ఎదుట నిరసనకు దిగారు. అనంతరం కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు 600 మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏపీజీడీఏ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, కోశాధికారి డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రోడ్డు వెడల్పులో తొలగిస్తున్న 8 షాపులకు కాలేజీలో స్థలాన్ని కేటాయించడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్నారు. కళాశాల ఎదుట ఉన్న షాపులకు రైతుబజారులో స్థలాన్ని కేటాయించారనీ, అక్కడికి వెళ్లకుండా కేఎంసీ స్థలాన్ని అడగడం.. అందుకు మున్సిపల్ అధికారులు వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. జూడాల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జగదీష్, ఉపాధ్యక్షుడు డాక్టర్ సాయికుమార్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో ఆక్రమణలను అడ్డుకుంటామని, అవసరమైతే ప్రాణాలైనా అర్పించి కాలేజీని కాపాడుకుంటామన్నారు. కాలేజీ, గ్రౌండ్స్ మాసొత్తు అని వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, నర్సులను కలుపుకుని తాము మరింత ఉద్యమిస్తామన్నారు. కాలేజీ ముందు అనధికారికంగా షాపులు ఉన్నాయని, రోడ్డు విస్తరణలో వాటిని తొలగించి మరో చోట స్థలాలు ఇవ్వాలే కానీ, విద్యాసంస్థలకు చెందిన స్థలాలను ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. కళాశాల స్థలాన్ని పరులపాలు కాకుండా కాపాడుకుంటామన్నారు. అనంతరం జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ నాయకులు జగదీష్, సాయికుమార్, ఆదివిష్ణు, కుమార రాజా తదితరులు డీఆర్వో, కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ర్యాలీ చేస్తున్న వైద్య విద్యార్థులు

జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

- ముగిసిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు

నంద్యాల, నవంబరు 28 : (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగే ఫెన్సింగ్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు పతకాలు తీసుకురావాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజు అన్నారు. నంద్యాలలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో మూడురోజుల నుంచి జరుగుతున్న అండర్-19 స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి బాల, బాలికల ఫెన్సింగ్ పోటీలు గురువారంతో ముగిశాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. డీఈవో జనార్దన్‌రెడ్డి, డీఎస్‌డీఓ రాజు, ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్, కర్నూలు జిల్లా అండర్-19ఎస్జీఎఫ్ కార్యదర్శి హర్షవర్ధన్, నంద్యాల జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి శ్రీనాథ్ విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎస్జీఎఫ్ కార్యదర్శులు మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ చూపినవారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశామని, జాతీయ స్థాయిలో జరిగే అండర్-19 ఫెన్సింగ్ పోటీలు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో డిసెంబర్ 17నుంచి 21వరకు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్ భవాని, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏపీరెడ్డి, నాగేంద్ర, నాగరాజు, విశ్వనాథ్, ఫెన్సింగ్ కోచ్ తదితరులు పాల్గొన్నారు.



ఫెన్సింగ్ విజేతలతో డీఈఓ, డీఎస్‌డీఓ

చీడ పీడల నియంత్రణకు ప్రత్యేక యాప్

- రైతులంతా వినియోగించాలి: జేడీ వరలక్ష్మి



మాట్లాడుతున్న జేడీ వరలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంటలపై వ్యాపించే తెగుళ్లు, క్రిమికీటకాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ఒక మొబైల్ యాప్‌ను రూపొందించిందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి గురువారం తెలిపారు. ఈ యాప్‌ను ఎలా వాడాలనే దానిపై అవగాహన కల్పించడానికి గురువారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కాన్ఫరెన్స్ హాల్లో కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి హాజరైన రైతులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ వరలక్ష్మి మాట్లాడుతూ జాతీయ చీడపీడల పర్యవేక్షణ వ్యవస్థను ఏ విధంగా మానిటరింగ్ చేయాలో వివరించారు. ఈ సమావేశానికి సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ విజయవాడ నుంచి కే. వీరయ్య చౌదరి, సురేష్ కాంబ్లీ నియంత్రణాధికారులు,రెండు జిల్లాల నుంచి 20 మంది ఆదర్శ రైతులు, 14 మంది వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు: డీఈవో

మహానంది, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పది విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం మహానంది మండలం ఎం.తిమ్మాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ప్రయోగశాలను పరిశీలించారు. విద్యార్థులకు పంపిణీ చేసే గుడ్లు, చెక్కీలను పరిశీలించారు. పదిలో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఉపాధ్యాయిలను ఆదేశించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ గురించి ఉపాధ్యాయులతో చర్చించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలతో పాటు బోధన అంశాలపై విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో రామసుబ్బయ్య పాల్గొన్నారు.



తిమ్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో డీఈఓ జనార్దన్‌రెడ్డి



శ్రీమఠం హుండీ లెక్కింపు పూర్తి

- ఆదాయం రూ.3.92 కోట్లు

మంత్రాలయం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం గురువారం లెక్కింపు పూర్తయినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్ తెలిపారు. బుధవారం నుంచి హుండీ లెక్కింపు చేపట్టగా.. గురువారంతో ముగిసింది. 31 రోజులకు గాను రూ.3,92,58,940 నగదుతో పాటు 74.500 గ్రాముల బంగారు, 1.270 కేజీల వెండితో పాటు వివిధ దేశాల కరెన్సీ వచ్చినట్లు వారు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో సూపరింటెండెంట్లు అనంతపురాణిక్, జేపీ స్వామి, రవికులకర్ణి, సుజ్ఞానేంద్ర, దేశాయ్ నరసింహస్వామి, శ్రీపాదాచార్ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన కుడా చైర్మన్ సోమిశెట్టి

కర్నూలు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు కుడా చైర్మన్ పదవి అవకాశం కల్పించినందుకు సీఎంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు కలిసిన వారిలో తెలుగు యువత రాష్ట్ర నాయకుడు సోమిశెట్టి నవీన్ ఉన్నారు.



సీఎంను కలిసిన కుడా చైర్మన్



మాట్లాడుతున్న కర్నూలు కలెక్టర్ పి.రంజిత్ బాషా

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ప్రభుత్వ ఎయిడెడ్ ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్మీడియట్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపుపై ప్రభుత్వ ఎయిడెడ్ ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపాల్‌తో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 50 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత సాధించాయన్నారు. పత్తికొండ, కోసిగి, ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 30 శాతం ఉత్తీర్ణత సాధించాయని, వంద శాతం పురోగతి సాధించాలని ఆదేశించారు.

ఇదేనా స్వచ్ఛ సంకల్పం?

చెత్తను తరలించాల్సిన వాహనాలు పనికిరాని వస్తువులకు తోడయ్యాయి. నెలల తరబడి మూలన ఉంచడంతో పరికరాలు తుప్పు పడుతున్నాయి. కోడుమూరు మండలంలో చెత్త సంపద కేంద్రంలో పదుల సంఖ్యలో కొత్త ట్రైసైకిళ్లు (రిక్షాలు) ఉన్నాయి. దాదాపు ఏడాదిగా పంపిణీ చేయకపోవడంతో ఇవన్నీ మూలనపడి తుప్పు పడుతున్నాయి. ఆదాయం, ఆరోగ్యం, ఆహ్లాదం లక్ష్యంగా చెత్త సంపద కేంద్రాలను ఉపాధి హామీ పథకం నిధులతో ప్రభుత్వం నెలకొల్పింది. అందుకు గ్రామ జనాభాను బట్టి గ్రీన్ అంబాసిడర్స్‌ను నియమించింది. వీరి ద్వారా తడి, పొడి చెత్త, వ్యర్థాలు సేకరించి సంపద కేంద్రాలకు తరలించడం జరుగుతుంది. ఇందుకు ట్రాక్టర్, ట్రైసైకిళ్లు, బ్యాటరీ ఆటోలు కేటాయించింది. చెత్త సంపద కేంద్రంలో వర్మీకంపోస్టు తయారీ, ప్లాస్టిక్ వ్యర్థాలు వేరు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. తద్వారా గ్రామాలు శుభ్రపడి ఆదాయం వస్తుంది. అయితే వాహనాలను నెలల తరబడి వినియోగించకుండా మూలన ఉంచితే చెత్తలో కలిసిపోవడం ఖాయం.

- కోడుమూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)



కోడుమూరు పంచాయతీ కార్యాలయంలో మూలనపడ్డ రిక్షాలు

నారా రామ్మూర్తి నాయుడికి బీసీ నివాళి



నారావారిపల్లెలో సహచర మంత్రులతో బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడుకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నివాళులర్పించారు. నారావారిపల్లెలో గురువారం జరిగిన రామ్మూర్తి నాయుడు దినకర్మ కార్యక్రమానికి మంత్రి బీసీ హాజరయ్యారు. ఈ సందర్భంగా సహచర మంత్రులతో కలసి నివాళులర్పించారు.

ఆర్మీ ఉద్యోగి భార్య
అనుమానాస్పద మృతి

- తమ్మడ పల్లిలో ఉద్రిక్తత
- పోలీసుల జోక్యంతో అంత్యక్రియలు

మహానంది, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మడపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి వెంకట క్రిష్ణకు నంద్యాల సాధిఖ్ నగర్‌కు చెందిన అనూషకు మూడు సంవత్సరాల క్రితం వివాహ మైంది. వెంకటక్రిష్ణకు వారణాసిలోని మిలటరీ క్యాంప్‌కు బదిలీ కావడంతో భార్యతో సహా అక్కడికి వెళ్లిపోయాడు. వీరికి రిత్విక్ శ్యాంబాబు అనే కుమా రుడు ఉన్నాడు. ఈనెల 23న అనూష(23) వారణాసిలో మృతి చెందింది.



అనూష(ఫైల్)

విషయాన్ని భర్త మృతురాలి తల్లితండ్రులకు తెలిపాడు. వారు వారణాసి చేరుకొని మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయ్యాక మృతదేహంతో పాటు 11 నెలల రిత్విక్ శ్యామ్‌తో గురువారం మహా నంది మండలం తమ్మడపల్లి లోని వెంకటక్రిష్ణ ఇంటి ముం దుకు చేరుకున్నారు. అయితే ఇది అనుమానాస్పద మృతి అని వారు వెంకటక్రిష్ణ ఇంటి ముందు ధర్నా చేయడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఆ సమయంలో వెంకటక్రిష్ణ తల్లితం డ్రులు ఇంట్లో లేరు. తమ మనవడికైనా న్యాయం చేయాలని అనూష తల్లిదండ్రులు గ్రామంలోని పెద్ద మనుషులను ఆశ్రయించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సర్దుబాటు చేశారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్‌లో నష్టపోయి కేసీ కెనాల్‌లో దూకి అనిల్‌బాబు (31) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అశోక్‌నగర్‌కు చెందిన అనిల్ బాబు కడపలో ఓ సినిమా టాకీసులో పాప్‌కార్న్ అమ్ముతూ జీవిస్తు న్నాడు. కొద్ది కాలంగా ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడ్డాడు. తన తల్లి సుజాత నుంచి రూ.20వేలు ఫోన్‌పే చేయించుకున్నాడు. ఈ నెల 21న ఇంటికి వచ్చి ఇంట్లో బ్యాగ్, సెల్‌ఫోన్ ఉంచి బయటకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత కనిపించలేదు. గురువారం కేసీ కెనాల్‌లోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించి మార్చ్యురీకి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషయ్య తెలిపారు.

బాధితులకు న్యాయం చేయాలి

- నేర సమీక్షలో ఎస్పీ జి.బిందుమాధవ్

కర్నూలు క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రాపర్టీ కేసులు, సైబర్ నేరాల కేసుల్లో బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లా లోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐ లతో ఎస్పీ నేర సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగ నూరు సబ్ డివిజన్‌లో



సీఐని అభినందిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల 2022-23, 24 సంవత్సరాల వారీగా చాలా కాలంగా ఉన్న పెండింగ్ కేసులను అడిగి తెలుసుకున్నారు. ప్రాపర్టీ కేసుల్లో రికవరీ శాతం పెంచాలన్నారు. యుఐ కేసులు తగ్గించాల న్నారు. పోక్సో కేసులు, పెండింగ్ ట్రయల్ కేసుల్లో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో మాట్లాడి నిందితులకు శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో కాంపౌండబుల్ కేసులు తగ్గించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్డు ప్రమాదంలో బాధితులకు తగిన నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, ఈ-చలానాలు రికవరీ చేయాలని ఆదేశించారు. సైబర్ చీటింగ్ కేసుల్లో బాధితులు మోసపోయిన నష్టాన్ని, బ్యాంకుల్లో ఫ్రీజ్ చేయించిన ఆ మొత్తాన్ని కోర్టు అనుమతితో బాధితులకు అందజే యాలని అన్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930కి వెంటనే ఫిర్యాదు చేసేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చందనబ్రదర్స్‌లో చోరీ కేసును ఛేదించిన టూటౌన్ సీఐ నాగరాజురావు, కానిస్టేబుల్స్ రాజు, రవీంద్ర, మహేంద్ర, మల్లికా ర్జునలను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.హుశేన్ పీరా, ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమోహన్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు, ట్రైనీ డీఎస్పీ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉపాధిలో అవినీతికి జైలే

- జీవో నెం.52 మరింత కఠినంగా అమలు చేయాలని నిర్ణయం
- విజిలెన్స్ విభాగానికి జవసత్వాలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ఏ పార్టీ అధికారంలో ఉంటే.. ఆ పార్టీ నాయకులకు జేబులు నింపే కల్పతరువు అనే విమర్శలు తరచూ వినిపిస్తూ ఉం టాయి. ఇలాంటి అక్రమా లకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ఇప్ప టికే ఉన్న జీవో.నెం.52కు పదును పెట్టాలని నిర్ణయించింది. ఈ స్కీంలో అక్రమాలను నిరోధిం చే విజిలెన్స్ విభాగాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. మళ్లీ ఆ విభాగానికి పూర్తిస్థాయిలో జవసత్వాలు కల్పిం చేందుకు విజిలెన్స్ విభాగాన్ని పటిష్టం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న సిబ్బందిలో జవా బుదారీతనాన్ని పెంచే ప్రయత్నంలో భాగంగా చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా వివిధ విభాగాలకు చెం దిన అధికారులను



కాకుండా పోలీసు అధికారిని నియమించడంతో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది ఈ పథకం ద్వారా జేబులు నింపుకుంటున్న నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కొత్తగా విజిలెన్స్ విభాగం అధికారిగా బాధ్యతలు తీసుకున్న చీఫ్ విజిలెన్స్ అధికారి భవానీ హర్ష నిఘా విభాగాన్ని పటిష్టం చేసేందుకు చర్యలు ప్రారంభించారని ఉమ్మడి కర్నూలు జిల్లా డ్వామా అధికారులు తెలిపారు. విజిలెన్స్ విభాగం అసలు లక్ష్యాలను సాధించేం దుకు చీఫ్ విజిలెన్స్ అధికారి భవానీ హర్ష అన్ని జిల్లాల్లో ఉపాధి హామీ పథకంలో జరిగిన, జరుగు తున్న పనుల వివరాలపై నివేదిక అందించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఉపాధి పథకంలో జరిగిన పనులపై ఇప్పటి దాకా సోషల్ ఆడిట్ విభాగం తనిఖీలు చేసి రికవరీ వసూలు చేసే అతి స్వల్ప పాత్రను మాత్రమే పోషిస్తోంది. ఇకపై విజిలెన్స్ విభాగం సోషల్ ఆడిట్‌ను ఆషా మాషీగా తీసుకోకుండా ఎన్ని పనులు చేప ట్టారు..? సక్రమంగా ఏ ఏ పనులు జరగాయి.. ఆ పనుల్లో ఎంత అవినీతి జరిగింది? అనేవి పరిశీలించి దుర్వినియోగ మైన ప్రతి రూపాయిని అక్రమా ర్కుల నుంచి వసూ లు చేసేందుకు విజి లెన్స్ విభాగం ముందుకు వెళ్లే అవకాశం ఉంది.

జీవో.నెం.52 ప్రకారం ఉపాధి హామీ పథకంలో రూ.లక్ష కంటే ఎక్కువ మొత్తంలో అవినీతి పాడినట్లు సోషల్ ఆడిట్‌లో నిర్ధారణైతే.. విచారణ చేయాలని డ్వామా అధికార వర్గాలు తెలిపాయి. ఆ జీవోను ఇప్పటి వరకు తుతూ మంత్రంగా అమలు చేశారు. కొత్తగా చీఫ్ విజిలెన్స్ అధికారి ఈ జీవోలో నిబంధనలపై దృష్టి పెట్టినట్లు డ్వామా పీడీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు ఆయా జిల్లాలో ఎంత మంది రూ.లక్ష కంటే ఎక్కువగా అవినీతికి పాల్పడినట్లు సోషల్ అధికారులు నిర్ధారించిందీ తెలుసుకొని వారిపై కేసులు నమో దు చేశారా? చేయకపోతే ఎందుక చేయలేదు? అందుకు కారణాలే మిటి? అనే వివరాలను అందించాలని ఆయా జిల్లాల విజిలెన్స్ అధికారులు పాల్గొంటున్నట్లు డ్వామా అధికార వర్గాలు తెలిపాయి. దీంతో పాటు అక్రమాలకు పాల్పడిన వారిపై ఆధార్ యాక్టు ఎన్నిచోట్ల వినియోగించారు? పరారీలో ఉన్న అక్రమార్కుల వివ రాలు.. అక్రమాలకు పాల్పడటంతో తొలగిం చబడిన సిబ్బంది వివరాలను పంపించాలని సర్క్యులర్‌లలో తప్పులు బైటపడ్డాయి. దీంతో తప్పుచేసిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడు తున్నాయి. ఇకపై ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అవకాశం ఉండదని పూర్తి స్థాయిలో అవినీతిని నిర్మూలించవచ్చని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. సోషల్ ఆడిట్‌లో తేలిన తప్పులపై మూడు రోజుల్లోపు చర్యలు తీసుకోవాలని జీవో.52లో స్పష్టంగా పేర్కొంది. ఈ నేపథ్యంలో విజిలెన్స్ ప్రొసీడింగ్‌ను ఖచ్చితంగా అమలు చేసేందుకు పీడీ అధికారులు సమాయత్తం అవుతున్నారు. కంచె చేను మేసినట్లుగా అక్రమార్కుల భరతం పట్టాల్సిన అధికారులు సోషల్ ఆడిట్ విభాగం గతంలో కొన్ని చోట్ల కమిషన్లు వసూలు చేయడంపైన దృష్టి పెట్టారు. దీంతో పాటు అంబుడ్స్‌మెన్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలకు కూడా పదును పెట్టే యోచనలో ఆ ప్రాజెక్టు అధికారులు దృష్టి పెట్టారు. ఏది ఏమైనా విజిలెన్స్ విభాగాన్ని కఠిన తరం చేస్తే ఇకపై ఉపాధి పథకంలో అవినీతికి పాల్పడిన వారు జైలుకు వెళ్లక తప్పదేమోనన్న భయం ఆ విభాగంలో పని చేస్తున్న వారిలో, రాజకీయ నాయకుల్లో కనిపిస్తున్నది.

జీవో నెం.52ను కచ్చితంగా అమలు చేస్తాం



ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు, అవినీతికి తావు లేకుండా విజిలెన్స్ విభాగాన్ని పటిష్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. చీఫ్ విజిలెన్స్ విభాగం అధికారి నుంచి జరిగిన పనులు, సోషల్ ఆడిట్‌లో తేల్చిన రికవరీ మొత్తాలపై వివరాలు అడుగుతూ ఉత్తర్వులు పంపారు. రానున్న రోజుల్లో ఉపాధి హామీ పథకం పూర్తి స్థాయిలో రైతులకు, రైతు కూలీలకు సక్రమంగా వినియోగించే అవకాశం ఉంది.

- వెంకటసుబ్బయ్య, డ్వామా పీడీ

ఆర్‌యూ ఘటనపై సీఎంవో ఆరా..!



- చర్చగా మారిన ప్రిన్సిపాల్‌పై దాడి ఘటన
- ఉప కులపతిని వివరణ కోరిన సీఎంవో ఓఎస్డీ

కర్నూలు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ ఘటనపై సీఎంవో కార్యాలయం స్పందించినట్లు తెలుస్తోంది. రాయలసీమ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డిపై జరిగిన దాడిపై ఆరా తీసినట్లు సమాచారం. రాయలసీమ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డిపై బుధవారం సాయంత్రం కొందరు విద్యార్థులు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డిపై బూతులతో రెచ్చిపోయి దాడికి పూనుకున్నారు. దీంతో ఆయన ఎస్పీని కలిసి తనకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు. అలాగే మంగళవారం రిజిస్ట్రార్ కారు డ్రైవర్‌ను కూడా ఓ విద్యార్థి నాయకుడు చితక బాదారు. మరోవైపు నాన్‌టీచింగ్ టైం స్కేల్ ఉద్యోగి వర్సిటీ విధులకు హాజరు సమయంలో దారి కాచి దాడి చేయాలని వ్యూహం పన్నారు. ఈ విషయం తెలిసి సదరు ఉద్యోగి కొందరు ఉద్యోగుల సహాయంతో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డిని ఆశ్రయించారు. వెంటనే ఎమ్మెల్యే జోక్యం చేసుకొని ఉన్నతాధికారిని మందలించినట్లు తెలిసింది. అయితే పథకం ప్రకారం క్యాంపస్‌లో దాడులు జరుగుతున్నాయని కొందరు విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

ప్రిన్సిపాల్‌పై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ఓ ఉన్నతాధికారి విద్యార్థులతో దాడులు చేయిస్తున్నారని కొందరు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. వరుస వివాదాలపై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లడంతో సీఎంవో ఓఎస్డీ వరప్రసాద్ ఉపకులపతిని వివరణ కోరినట్లు సమాచారం. విషయంపై వర్సిటీ రిజిస్ట్రార్ బోయ విజయకుమార్‌ను వివరణ కోరగా ప్రిన్సిపాల్‌తో విద్యార్థి నాయకుల వాగ్వివాదం వాస్తవ మేనని, దాడులు జరగలేదని అన్నారు. ఎస్పీని కలిసి తనకు విద్యార్థుల నుంచి రక్షణ కల్పించాలని ప్రిన్సిపాల్ ఆశ్రయించారని తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసినా స్పందించలేదని అన్నారు. 'నిన్ను నేను ఎన్ని సార్లు కాపాడాలి, నీవే సమస్యను పరిష్కరించుకోవాలని ఫోన్ కట్ చేశారని' పేర్కొన్నారు. విద్యార్థి నాయకుడు బూతులతో రెచ్చిపోవడం దారుణమని, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

యువకుడి ఆత్మహత్య

బేతంచెర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన షేక్ టర్కి మహ్మద్ రఫీ కుమారుడు షేక్ టర్కి హిమయత్ (37) గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు నాపరాళ్ల వ్యాపారంతో నష్టపోయాడు. దీనికితోడు ఆయన భార్య ఏడాది క్రితం మృతి చెందింది. దీంతో ఈ నెల 25న అదృశ్యమయ్యాడు. హిమయత్‌ని ఇంటికి తీసుకుని రాగా, రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు.

సాహితీ దిగ్గజం వెంకటసుబ్బయ్య కన్నుమూత



కర్నూలు కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, చారిత్రక, పురాణాల పుస్తకాల రచయిత, వక్త డాక్టర్ అప్పాజోడు వెంకట సుబ్బయ్య (90) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కోలుకోలేక బుధవారం కర్నూలు అశోక్‌నగర్‌లోని ఆయన స్వగృహంలో కన్ను మూశారు. గురువారం ఆయన అంత్యక్రియలు కర్నూలులో నిర్వహించారు. ఆయనకు లలిత కుమారి, శ్రీవల్లి ఇద్దరు సంతానం. ఆయన భార్య సరోజనీదేవి ఇటీవలే కన్నుమూశారు. 1935 మార్చి 21న జన్మించిన వెంకట సుబ్బయ్య హైదరాబాదు ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి 'మహా భరతము - మా నవ స్వభావచిత్రణ' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించి డాక్టరేట్ పొందారు. తెలుగు అధ్యాపకుడిగా, ఆంధ్రశాఖాధ్యక్షులుగా అనంతపురం, గూడూరు, హైదరాబాదు, నంద్యాలలో పని చేశారు. కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలల్లో ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధ్యాపకునిగా 1983లో, కళాశాల ప్రిన్సిపాల్‌గా 1988లో ఉత్తమ అధ్యాపక పురస్కారాలు అందుకున్నారు. అలాగే సాహిత్య విమర్శ కునిగా తెలుగు విశ్వ విద్యాలయం నుంచి 2008లో విశేష పురస్కారం అందుకున్నారు. వ్యాస మంజరి, షట్పది, జీవన చిత్రాలు (రామాయణ పాత్రలు), టీటీడీ ప్రచురించిన ఆంధ్ర మహాభారతము ఆదిపర్వం 5, 6, 7, 8 అశ్వాలకు, సభా పర్వానికి సమగ్ర వ్యాఖ్య రాశారు. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్‌లో కార్యదర్శిగా సేవలు అందించారు. అలాగే టీటీడీ ముద్రణాలయం తలపెట్టిన పౌరా ణిక, ఇతిహాస గ్రంథాల పునర్ముద్రణలో భాషా వేత్తగా తనదైన సేవలు అందించారు. ఆయన మృతికి టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సామాజికవేత్త కేసీ కల్కూర, మధురకవి ఎలమర్తి రమణయ్య, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కా.వెం.సుబ్బల క్ష్మమ్మ, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, జేఎస్ఆర్‌కే శర్మ నివాళి ప్రకటించారు.



నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు

మహానంది, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలోని నందీశ్వరుడికి గురువారం సాయంత్రం వేదపండితులు ప్రదోషకాల పూజలు నిర్వహించారు. కార్తీక బహుళ త్రయోదశి మహా ప్రదోషకాలం పురస్కరించుకొని ప్రధాన గర్భాలయం ముందు భాగంలోని రాతి నందీశ్వరునికి వేదమంత్రాలతో నందీశ్వరాభిషేకం జరిపారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జునశర్మ, రాఘవశర్మ పాల్గొన్నారు.

నేడు మహానందీశ్వరునికి లక్ష బిల్వార్చన

మహానంది, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కార్తీక మాసం ముగింపు ఉత్సవాలను పురష్కరించుకొని శుక్రవారం లక్ష బిల్వార్చన పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన గర్భాలయంలో ఉదయం మహా రుద్రాభిషేకంతోపాటు వేదపండితులు, రుత్వికులు, అర్చకులు వేదమంత్రాలతో లక్ష బిల్వార్చనను జరుపుతారని చెప్పారు.

అమ్మవారికి వెండి కిరీటాల సమర్పణ


వెండి కిరీటాలు

మహానంది, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహానందిలోని కామేశ్వరీదేవి అమ్మవారికి గురువారం ఉయ్యాలవాడకు చెందిన భరత్ కుమార్‌రెడ్డి వెండి కిరీటాలు ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ఆలయ వేదపండితులకు అందజేశారు. అమ్మవారి అలంకరణ కు ఉపయోగించే వెండి కిరీటాల విలువ రూ.2.25 లక్షలు అని దాత చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డిలతో పాటు అర్చకులు మణికంఠశర్మ, సుబ్బయ్యశర్మ, హరిశర్మ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల పట్ల ఉదాసీనత ఎందుకు?


మాట్లాడుతున్న మాబువలి

నంద్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మునిసిపాలి టీ పరిధిలో అనుమతుల్లేని ఇంటి నిర్మాణాల పట్ల ఎందుకు ఉదాసీనం గా వ్యవహరిస్తున్నారంటూ నంద్యాల మునిసిపాలిటీ టీడీపీ ఫ్లోర్ లీడర్ మాబువలి ప్రశ్నించారు. నంద్యాల మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మాబువలి మాట్లాడుతూ ఫరూ ఖ్ నగర్‌లోని ఓ ఇంటి నిర్మాణానికి సంబంధించి అనుముతులు ఉన్నా యా అని ఏసీపీ (అసిస్టెంట్ సిటీ ప్లానర్) నరసింహమూర్తిని అడిగా రు. దానికి ఆయన లేదని సమాధానం చెప్పగా, ఇలాంటివి నంద్యాల పట్టణంలో చాలా ఉన్నాయని, అయినా సిటీ ప్లానింగ్ అధికారులు ఏమీ పట్టించుకోవటం లేదని, కొన్నింటికి మాత్రం నిబంధనల పేరిట షాట్‌ఫాల్ అంటూ అనుమతులను జాప్యం చేస్తున్నారని అన్నారు. డబ్బులు ఉన్న వారి పట్ల ఓ విధంగా లేని నిర్మాణదారులతో ఇంకో విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

పూలే అడుగు జాడల్లో నడుద్దాం


పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి


జూపాడుబంగ్లాలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


ఆత్మకూరులో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

నంద్యాల, నవంబరు 28 : (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావుపూలే అడుగుజాడల్లో నడుద్దామని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా నంద్యాలలోని పద్మావతినగర్ సెంటర్‌లో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. నంద్యాలలోని పూలే విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శ్రీరాములు, త్రిలింగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

● జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్, సమాజ్‌వాది పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు పెరుగు శివకృష్ణ యాదవ్ అన్నారు. పట్టణంలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నందికొట్కూరు రూరల్ : జ్యోతిరావు పూలే అడుగు జాడల్లో నడవాలంటూ నంద్యాల జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కురుమూర్తి పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు రైతు సంఘం కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఆత్మకూరు రూరల్: మహాత్మజ్యోతిరావు పూలే జీవితం అందరికీ ఆదర్శమని బీసీ సంఘం నాయకులు డాక్టర్ నాగన్న, వెంకటస్వామి గౌడ్, బహుజన సమాజ్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, శ్యాంలు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సంగమేశ్వరం సర్కిల్‌లో పూలే విగ్రహానికి నివాళ్లర్పించారు.

● **పాణ్యం, నవంబరు:** మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతి వేడుకలు పాణ్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టీ చంద్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ యాఐ జిల్లా కార్యదర్శి ప్రతాప్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు శివ కృష్ణ, సీపీఐఎంఎల్, న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

● **గడివేముల:** జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలను మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి గురువారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నరేంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, సాయి పాల్గొన్నారు.

● **వెలుగోడు:** బీసీల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్ అన్నారు. గురువారం వెలుగోడు పట్టణంలోని వేంపెంట సర్కిల్‌లో గల జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

● **పగిడ్యాల:** జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి వేడుకలను జడ్పీటీసీ పుల్యాల దివ్య, సర్పంచ్ శేషన్నల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, గంగాధర్‌రెడ్డి, శేనారెడ్డి పాల్గొన్నారు.

● **జూపాడుబంగ్లా:** జ్యోతిరావుపూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రమేష్‌బాబు, ఎర్రన్న, వైవీ రమణ, నాగార్జున రెడ్డి, తరుణ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, దినేష్ పాల్గొన్నారు.

పాత కట్టడాలను ఆధునికీకరిస్తాం

మహానందిలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పూజలు


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మహానంది, నవంబరు 28 (ఆంధ్రజ్యో తి): మహానందిలో పురాతన కట్టడాలను ఆధునికీకరిస్తామని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. మహానందిలో కార్తీక మాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, శైలజ దంపతులు వచ్చారు. వీరికి ఆలయం ముఖ ద్వారం వద్ద ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషే కార్చనలను భక్తి శ్రద్ధలతో జరిపారు. ఎమ్మెల్యే దంపతులు నాగులకట్ట వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. వీరిని కల్యాణ మండపంలో వేద పండితులు ఆశీర్వదించారు. ఈవో స్వామివారి మెమెం టోను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయం పరిసరాల్లోని పురాతన రాతి మండపాలను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న విష్ణు గుండంను ఆధునికీకరణకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేయాలని ఈవోను ఆదేశించారు. తాగునీటి పైపులైన్‌తోపాటు అండర్ గ్రౌండ్‌లో విద్యుత్ కేబుల్ పనుల నిర్మాణం జరుపుతామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులు బన్నూరి రామలిం గారెడ్డి, బుడ్డారెడ్డి శ్రీనివాస రెడ్డి, నరాల చంద్ర మౌళీశ్వరరెడ్డి, ఉల్లి మధు, పాణ్యం ప్రసాదరావు ఉన్నారు.

నందీశ్వరుడికి విశేష పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో గురువారం త్రయోదశి ఘడియలను పురస్కరించుకొని సాయంప్రదోష కాలంలో ఆలయంలోని మల్లికార్జున స్వామికి అభిముఖంగా కొలువైవున్న నందీశ్వర స్వామికి పరోక్ష సేవగా విశేష అభిషేకం, అర్చనలు జరిపించారు. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ నిర్వహించా రు. అనంతరం నందీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలు, పలు ఫలోదకాలు, కుంకుమోదకం, హరిద్రోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం, మల్లికార్జున గుండంలోని శుద్ధ జలాలతో అభిషేకం నిర్వహించి అనంతరం అన్నాభిషేకం జరిపారు. అభిషేకానంతరం నందీశ్వరస్వామికి నూతన వస్త్ర సమర్పణ, విశేష అర్చనలు జరిపి, నానబెట్టిన శనగలను సమర్పించారు. తరువాత స్వామికి నివేదన సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన విజయలక్ష్మి కూచిపూడి కళాక్షేత్రం బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమా న్ని ఏర్పాటు చేసింది. మూషికవాహన, శివాష్టకం, అయిగిరినందిని, ఓం నమఃశివాయ తదితర గీతాలకు లిఖిత, శివాని, హేమలత, దివ్య, ఉమ, నందిని, వైష్ణవి, సహజ, చరిత తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి: ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య


ఓ వర్గం కౌన్సిలర్ల గైర్హాజరుతో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

నందికొట్కూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నందికొట్కూరు పట్టణాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. గురువారం నందికొట్కూరు మున్సిపల్ సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నందికొట్కూరు పట్టణ ప్రజలు తాగునీటి ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇప్పుడే అలా ఉంటే వేసవిలో ఎలా మంచినీటిని సర్దుబాటు చేస్తారని మున్సిపల్ సభ్యులను, అధికారులను ప్రశ్నించారు. పట్టణంలో రోడ్లకు డివైడర్లను ఏర్పాటు చేసి ఇరువైపులా బటర్‌ఫ్లై లైట్లను ఏర్పాటు చేయాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ బేబి మాట్లాడుతూ పట్టణంలో దాదాపుగా 20 బోర్లు రిపేరులో ఉన్నాయని, వాటిని బాగు చేయించేందుకు కౌన్సిల్ సభ్యులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు రబ్బాని, ప్రశాంతి పాల్గొన్నారు.

చైర్మన్ వర్గం గైర్హాజర్..

నందికొట్కూరు మున్సిపల్ సాధారణ సమావేశానికి చైర్మన్ దాసి సుధాకరెడ్డి వర్గానికి చెందిన 15 మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. గత నెల కిందట కూడా సాధారణ సమావేశం వాయిదా పడింది. మరలా ఈ సమావేశానికి కూడా చైర్మన్ తోపాటు 14 మంది కౌన్సిలర్లు గైర్హాజర్ కావడంపై పట్టణంలో రాజకీయంగా చర్చ జరుగుతోంది.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మిడుతూరు: సంక్షేమంతోపాటు అభివృద్ధి సాధించడమే ఎన్‌డీఏ ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మిడుతూరు గ్రామ సమీపంలోని కరెంటు సబ్‌స్టేషన్ వద్ద నుంచి తలముడిపి బాట వరకు నూతన రెండు లైన్ల రోడ్డును నిర్మించేందుకు గురువారం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ గోవర్ధన్, ఎంపీడీవో దశరథరామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, ఈవోఆర్‌డీ సంజన్న, ఆర్అండ్‌బీ ఏఈ మనోజ్, టీడీపీ సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, శివరామిరెడ్డి, సర్వోత్తమ రెడ్డి పాల్గొన్నారు.

దుర్గాభోగేశ్వరంలో ఎమ్మెల్యే పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

గడివేముల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిగరేవు ల గ్రామ సమీపంలో ఉన్న దుర్గాభోగేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే గౌరు చరిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాభోగేశ్వరుడిని దర్శించుకొని పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం త్రిపురాంబ సమేత పాలకేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్, వేద పండితులు ఎమ్మెల్యేను సన్మానించి దుర్గాభోగేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరెడ్డి, చిందుకూరు సర్పంచ్ అనసూయమ్మ, వంట రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

దస్తగిరి స్వామి దర్గా జీర్ణోద్ధరణ

గడివేముల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దస్తగిరిస్వామి దర్గా జీర్ణోద్ధరణ వేడుకలను గురువారం నిర్వహించారు. దాతల సహకారంతో దర్గాను అభివృద్ధి చేశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత దస్తగిరికి దర్గాను దర్శించుకొని ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. కార్యక్రమంలో దేశం సత్యనారాయణరెడ్డి, ఎస్‌ఏ రఫిక్, గడివేముల జమాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఓంకారంలో కలెక్టర్ పూజలు

బండిఆత్మకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఓంకార క్షేత్రంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి వేర్వేరుగా దర్శించుకుని పూజలు చేశారు. గురువారం ఉదయం ముందుగా కలెక్టర్ రాజకుమారి ఓంకారం చేరుకోగానే ఈవో నాగప్రసాద్, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ గంగా ఉమా సమేత సిద్ధేశ్వరస్వామి వార్లకు పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆయన సతీమణి బుడ్డా శైలజ ఓంకారం చేరుకోగానే ఈవో నాగప్రసాద్, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వార్లకు వారు అభిషేకాలు, అర్చనలు చేశారు. కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో అన్నపూర్ణేశ్వరీ అమ్మవారికి పూజలు చేశారు. కలెక్టర్, ఎంఎల్ఏ దంపతులను ఈవో ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

మండల అభివృద్ధికి కృషి చేద్దాం

నంద్యాల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేద్దామని నంద్యాల మండల ప్రత్యేక అధికారి, జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం నంద్యాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుగుణశ్రీ ఆధ్వర్యాన, ఎంపీపీ శెట్టి ప్రభాకర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు విద్యా వికాసానికి కృషి చేయాలన్నారు. ఎంపీడీవో సుగుణశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ మాట్లాడుతూ బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో రూరల్ డీటీ రామచంద్రరావు పాల్గొన్నారు.

పలు తీర్మానాలకు ఆమోదం

ఆత్మకూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా, కమిషనర్ రమేష్ బాబు అధ్యక్షతన గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పది అజెండాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నాగబ్రహ్మం, టీపీవో రామకృష్ణ, ఏఈ షాహీద్ బాషా, శానిటేషన్ ఏఈ ఓబులేసు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రషీద్, వైస్ చైర్మన్ రాజగోపాల్, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కొత్తపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కొత్తపల్లి ఎస్ఐ కేశవ అన్నారు. గురువారం మండలంలోని శివపురం, గోకవరం హైస్కూళ్లలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, మహిళలపై జరిగే అఘాయిత్యాలు, బాలికల సంరక్షణ చట్టం, సైబర్ క్రైమ్స్, డ్రగ్స్, లోన్ యాప్ మోసాలు, రహదారి భద్రతా వంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కేశవ మాట్లాడుతూ ఏదైనా ఆపద సమయంలో డయల్ 100, 112లకు ఫోన్ చేసి తక్షణమే పోలీసుల సహకారం పొందాలని అన్నారు.

బీరవోలులో టీడీపీ సభ్యత్వ నమోదు

పగిడ్యాల, నవంబరు 28,(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీరవోలు గ్రామంలో టీడీపీ నాయకులు చిమ్మె బిచ్చన్న, జయరాఘవ నాయుడు ఆధ్వర్యంలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారని అన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. సభ్యత్వం నమోదు చేసుకున్న ప్రమాద బీమ వర్తిస్తుందని తెలియజేశారు.

ఎరువుల వాడకం తగ్గించాలి

బండిఆత్మకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులు ఎరువుల వాడకం తగ్గించాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. గురువారం బండిఆత్మకూరులో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం బండిఆత్మకూరులో రైతులతో కలిసి వరి పంటలను పరిశీలించారు. తక్కువ పెట్టుబడులు పెట్టి ఎక్కువ రాబడి తెచ్చుకోవాలని అన్నారు. తుఫాన్ ప్రభావం ఉన్నందున కోతలు తాత్కాలికంగా ఆపుకోవాలని చెప్పారు. కోసిన పంటలను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సాతి, ఎంపీఈవోలు, వీఏఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఆత్మకూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కంటి వైద్యాధికారి షేక్షావలి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి లోపాలు ఉన్న వారిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి బాయి, అధ్యాపకులు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై ర్యాలీ

జూపాడుబంగ్లా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1న ఎయిడ్స్ నివారణ దినాన్ని పురష్కరించుకుని గురువారం జూపాడుబంగ్లాలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ భూతంతో అప్రమత్తంగా ఉండాలని వైద్యఆరోగ్య పర్యవేక్షణ అధికారి రాముడు అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యార్థినులు జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

గడివేముల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి హేమసుందర్ రెడ్డి అన్నారు. మండలంలోని ఎల్‌కే తండా, వైకే తండాల్లో గురువారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు బీమా పథకంపై అవగాహన కల్పించారు. రైతులే ప్రీమియం చెల్లించాలని అన్నారు. కంది పంటకు ఆశించే తెగుళ్లను, వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు.

ప్రొటోకాల్ పాటించాలి

పాములపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రొటోకాల్ పాటించాలని మండల టీడీపీ నాయకులు కురువ ఎల్లయ్య అన్నారు. గురువారం పాములపాడులో ఆయన మాట్లాడారు. బుధవారం స్థానిక ఎస్సీ కాలనీలో నూతన అంగన్వాడీ కేంద్రం ప్రారంభం కార్యక్రమానికి బైరెడ్డి శబరిని పిలవకపోవడం అవమానంగా భావిస్తున్నామని అన్నారు. ప్రొటోకాల్‌లో రాజకీయం చేయడం తగదని, స్థానిక నాయకులు ఎన్ని చెప్పిన అధికారులు తమ విధి నిర్వహణను సక్రమంగా నిర్వర్తించాలని కోరారు. ప్రారంభించిన శిలాఫలకంపై మండల డెవలప్‌మెంట్ అధికారి, కాంట్రాక్టర్ పేర్లు లేకపోవడం అవమాన కరమని అన్నారు. కార్యక్రమంలో వీరారెడ్డి, బాలస్వామి, వెంకటస్వామి పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పాములపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూటూరు గ్రామంలోని సచివాలయాన్ని ఎంపీడీవో చంద్రశేఖర్ తనిఖీ చేశారు. గురువారం ఆయన సిబ్బంది అటెండెన్స్ రిజిష్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగు, జియో ట్యాగింగ్, పనులను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

ఆత్మకూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం సిద్దాపురం గ్రామ శివార్లలోని నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ గురువారం తెలిపారు. సిద్దాపురం గ్రామ సమీపంలోని బనవాసి వంక, చిన్న ఒప్పి, పాత పసుపులదొడ్డి అటవీ ప్రాంతంలో నాటుసారా స్థావరాలను గుర్తించి 3700 లీటర్ల బెల్లపు ఊటను, నాటుసారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు వీరస్వామి, జగదీష్, నంద్యాల ఎస్ఐలు బ్రహ్మయ్య, నందికొట్కూరు ఎస్ఐ జవుర్లా పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కరిమద్దెల విద్యార్థులు ఎంపిక

గడివేముల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిమద్దెల హైస్కూల్‌కు చెందిన మోహన్, దేవేంద్ర, మంజూషాలు రాష్ట్రస్థాయి త్రోబాల్ అండర్-14 పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బాలవెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 29న చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో పాల్గొంటారని అన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి : జేసీ

శిరివెళ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని జేసీ విష్ణు చరణ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని యర్రగుంట్ల నుంచి వనికెందిన్నె గ్రామానికి వెళ్లే రహదారిలో నిర్మాణంలో ఉన్న పెట్రోలు బంకును ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన అర్జీలను సమగ్రంగా విచారించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్ప కుమారి, వీఆర్వోలు నాగరాజు, హసీనా, రసూల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ ఉచ్చులో పడొద్దు

బనగానపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి అన్నారు. గురువారం బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ స్మార్ట్ సెల్ ఉన్న ప్రతి ఒక్కరు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడే ప్రమాదం ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ బాగా చదువుకున్న విద్యార్థులు డబ్బు సంపాదనలో పడి అడ్డగోలుగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. అపరిచితులు కాల్ చేస్తే అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మహమ్మద్‌గౌస్, రామకృష్ణ, నీతమ్మ, కౌసల్యాదేవి, నాగరాజారెడ్డి, రామన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్యాధికారి శివశంకరుడు

బనగానపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని టంగుటూరు వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు సూచించారు. గురువారం బనగానపల్లె మండలం ఇల్లూరుకొత్తపేటలోని జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అలాగే బీసీ బాలుర వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం సోమశేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, సరస్వతి, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీసీ ఇందిరమ్మ

కోవెలకుంట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. గురువారం కోవెలకుంట్ల పట్టణంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో పలు పోటీలను కరస్పాండెంట్ సిస్టర్ జాన్‌మేరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీసీ ఇందిరమ్మ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, డాక్టర్ చంద్రశేఖ ర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పెనుగొండ రాజశేఖర్, కులాయి, సాదిక్‌బాషా పాల్గొన్నారు.

పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ

సంజామల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సంజామలలో వెలిసిన అంకాలమ్మ అమ్మవారి ఆలయం ఎదుట పోతు రాజు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేడుకలకు సంజామల, ఎగ్గోని, చిన్నకొత్తపేట, ముచ్చలపురి గ్రామాల నుంచి తరలి వచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నిందితుల అరెస్టు

చాగలమర్రి, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చింతల చెరువు గ్రామానికి చెందిన నిందితులు వడ్డె లక్ష్మీనరసింహ, అతడి భార్య లక్ష్మీదేవిలను ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు ఆధ్వర్యంలో అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి గురువారం రాత్రి తెలిపారు. రస్తా విషయంలో గొడవ పడి ఓ వ్యక్తి మృతికి కారణం కావడంతో దంపతులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

పైపులైన్ పగిలి రోడ్డుపైకి నీరు



రోడ్డుపై పారుతున్న నీరు

సంజామల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సంజామలలోని జామియా మసీదు దగ్గర పైపు లైన్ లీక్ అవడంతో రోడ్డుపై నీరు పారుతోందని స్థానికులు వాపోతున్నారు. వారం రోజుల నుంచి గ్రామానికి నీటి సరఫరా చేసే పైపులైన్ లీకై, నీరు కలుషితమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పైపు లీకైన ప్రాంతంలోనే రోడ్డు గుంతలు పడటంతో నీరంతా గుంతలో నిలుస్తోందని, దాంతో పారిశుధ్యం లోపించింది. ఇదే రహదారిలో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజుల నుంచి ప్రధాన రహదారిలోనే ఇలాంటి సమస్య ఉంటే పంచాయతీ కార్యదర్శి, వైద్య ఆరోగ్య సిబ్బందికి చీమకుట్టినట్లు లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

బేతంచెర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. అందులో భాగంగా పట్టణంలోని 85 బూతులో టీడీపీ సభ్యత్వం నమోదు కార్యక్రమం గురువారం యూనిట్ ఇన్‌చార్జి టైలర్ రాముడు అధ్యక్షత జరిగింది. టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం చేసుకున్న వారికి రూ.5 లక్షలు ప్రమాద బీమా ఉంటుందని, వారి కుటుంబానిక టీడీపీ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో చింతకాయల విజయకుమార్, అశోక్ బాల్‌రాజ్ పాల్గొన్నారు.

సాయి బాబా ఆలయంలో పూజలు

కొలిమిగుండ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగుడి, కొలిమిగుండ్ల గ్రామాల్లో వెలసిన సాయిబాబా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం, స్వాతి నక్షత్రం పురస్కరించుకొని సాయిబాబాను ప్రత్యేకంగా దీపాల అలంకరణ చేపట్టి, విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని సాయినాథ మందిరంలో గురువారం సాయిబాబా పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా మహిళలు సామూహికంగా దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు. సాయివ్రతం చేశారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి



సిబ్బందితో మాట్లాడుతున్న డ్వామా పీడీ జనార్దనరావు

ఉయ్యాలవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులు వేగవంతం చేయాలని డ్వామా పీడీ జనార్దన్‌రావు సూచించారు. గురువారం మండలంలో పర్యటించి సర్వాయపల్లె గ్రామంలో మినీ గోకులం షెడ్డును పీడీ పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో 50మందికి తగ్గకుండా కూలీలకు పనులు కల్పించాలన్నారు. పండ్ల సాగు టార్గెట్ పూర్తి చేయాలని సిబ్బందికి తెలిపారు. మినీ గోకుల పనులను వేగవంతం చేయాలన్నారు. కూలీల వేతనాలు పెండింగు లేకుండా బిల్లులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కూలీలకు కనీస వేతనం రూ.300 తగ్గకుండా పనులు చేయించాలన్నారు. జిల్లాలో 850 మినీ గోకులాలు నిర్మాణం టార్గెట్ కాగా ఇప్పటి వరకు మూడుషెడ్లు పూర్తికాగా, 588 షెడ్లు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయన్నారు. ఈ షెడ్ల నిర్మాణానికి రూ2.35 కోట్లు ప్రభుత్వం చెల్లిస్తుండగా పదిశాతం రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే జిల్లాలో 10026 సీసీరోడ్లు నిర్మిస్తున్నామన్నారు. సీసీరోడ్ల నిర్మాణానికి రూ.8.85కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 76.75 లక్షల పనిదినాలు టార్గెట్ కాగా ఇప్పటివరకు 67 లక్షల పనిదినాలు పూర్తి అయినట్లు తెలిపారు. వీటి కోసం రూ.18.91 కోట్లు కూలీల వేతనాలు చెల్లించామన్నారు. మిగిలిపోయిన 9.75 లక్షల పనిదినాలు వచ్చేఏడాది మార్చి చివరి నాటికి పూర్తిచేస్తామని ఆయన తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే శాఖాపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బనగానపల్లె క్లస్టర్ ఏపీడీ సాంబశివరావు, ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు, ఏపీవో రవిప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

బెదిరించడం తగదు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధి

చాగలమర్రి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో రహదారులు, భూ సమస్యలు పరిష్కరించాలని అడిగితే కేసులు పెడతామంటూ బెదిరించడం తగదని సర్పంచ్ బాలీశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ నరసింహులు అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ముందుగా మహాత్మాజ్యోతి రావుపూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో పూర్వకాలం నుంచి ఉండే రహదారుల సమస్యలను పరిష్కరించమని అడిగితే కేసులు పెడతామని తహసీల్దార్ రవికుమార్ చెప్పడం సమంజసం కాదని అన్నారు. భూ సమస్యలతో గ్రామాల రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, రెవెన్యూ వారు పట్టించుకోవడం లేదని వాపోయారు. తహసీల్దార్ మాట్లాడుతూ రహదారుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ వీరభద్రుడు మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఆయాశాఖల అధికారులు తమతమ శాఖల పురోగతిని వివరించారు. సమావేశంలో జడ్పీటీసీ లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీలు రఫి, ఆశీర్వాదమ్మ, సీడీపీవో తేజేశ్వరి, ఉద్యానశాఖ అధికారి శ్రీధర్, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, షాజహాన్, నరసింహరావు, వైద్యాధికారి అంజలి, పశువైద్యాధికారి సాయిబాబా, ఏపీవో నిర్మల, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి



టీడీపీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఉయ్యాలవాడ మండలం గోవిందపల్లె గ్రామానికి చెందిన సర్పంచ్ ఉమాదేవి, భర్త చంద్రశేఖర్‌రెడ్డితో పాటు 25 కుటుంబాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు వైసీపీని వీడి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, టీడీపీ నాయకులు భార్గవ్‌రామ్, భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిల సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం చంద్రబాబు నాయుడు అందిస్తున్న సం క్షేమం, ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి వైసీపీని వీడి టీడీపీలోకి వచ్చినట్లు వారు తెలి పారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ఆళ్లగడ్డ పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సూచించారు. జూనియర్ కళాశాలకు నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన అజయ్ కుమార్ ఎమ్మెల్యేను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా విద్యాబోధన చేయాలని ఎమ్మెల్యే అన్నారు. కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామన్నారు.

2న బహిరంగ వేలం

శిరివెళ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలోని సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో డిసెంబరు 2న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో బీవీ నరసయ్య గురువారం తెలిపారు. ఆలయం వద్ద టెంకాయలు, తినుబండారాలు, ఐస్‌క్రీమ్స్ తదితర వాటిని విక్రయించుకునేందుకు, భక్తులు సమర్పించే తలనీలాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కును పొందేందుకు ఏడాది కాలపరిమితితో వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు నిర్ణీత సొమ్మును డిపాజిట్‌గా చెల్లించి వేలం లో పాల్గొనాల్సి ఉంటుందని ఈవో తెలిపారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.23.77 లక్షలు

బేతంచెర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహ స్వామి, మహాలక్ష్మి అమ్మవారి హుండీల లెక్కింపులో రూ.23.77 లక్షల ఆదాయం లభించినట్లు ఉప కమిషనర్ ఆలయ ఈవో రామాంజనేయు లు గురువారం తెలిపారు. దేవాదాయ శాఖ అధికారి రమేష్ సమక్షంలో స్వా మి, అమ్మవార్ల హుండీ లెక్కించినట్లు ఆయన తెలిపారు. లెక్కింపులో వేద పండితులు, అర్చకులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ అటెండెన్స్ రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : గతంలో అమలులో ఉన్న ప్రైవేట్ అటెండెన్స్ రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రభుత్వం పునరుద్ధరించాలని దస్తావేజు లేఖరులు లూకయ్య, రామ సుబ్బయ్య, కరీముల్లా డిమాండ్ చేశారు. గురువారం ఆళ్లగడ్డ సబ్ రిజిస్ట్రార్ కార్యలయం వద్ద పాత విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలంటూ వారు నిరసన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ శాఖలో 2.0 విధానం అమలులో లేనప్పుడు వృద్ధులు, అనారోగ్యంతో బయటకు రాలేని పరిస్థితుల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి ప్రైవేట్ అటెండెన్స్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసే సౌకర్యం ఉండేదన్నారు. ప్రస్తుతం ఈ విధానం అమలులో లేనందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పాత విధానాన్ని అమలు చేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉయ్యాలవాడ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్. జంబులదిన్నె గ్రామ మెట్ట వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు మండలం గొడిగెనూరు గ్రామానికి చెందిన నవీన్ ఎలాంటి అనుమతులు లేకుండా జమ్మలమడుగు నుంచి ఆర్.జంబులదిన్నెకు ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయర తెలిపారు.

రెండు గడ్డివాములు దగ్ధం

కోవెలకుంట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల మండల పరిధిలోని పెద్దకొప్పెర్ల గ్రామంలో గురువారం రాత్రి ప్రమాదవశాత్తు రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన మహదేవుడు మునగాల సుదర్శన్‌రెడ్డికి చెందిన రెండు గడ్డివాములు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పెద్ద మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న శంకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన పెద్దకొప్పల గ్రామానికి చేరుకుని కాలుతున్న రెండు గడ్డివాములను మంటలు ఆర్పారు. అప్పటికే కాలిపోవడంతో సుమారు రూ.2లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతన్నారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టండి

ఉయ్యాలవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంఎస్ఎంఈ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో ఉమా మహేశ్వర్‌రావు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామ సచివాలయాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో తిరిగి సర్వేను డిసెంబరు నాటికి పూర్తి చేయాలన్నారు. దీని వల్ల చిన్న, సూక్ష్మ మధ్య పరిశ్ర మలకు ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మాదిగల ఆత్మీయ కలయిక

డోన్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడుముల పాడు గ్రామ సమీపంలో ఈనెల 30న నిర్వహించనున్న మాదిగల కార్తీక వన భోజన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆహ్వాన కమిటీ సభ్యులు కోరారు. గురువారం పట్టణంలో ఆత్మీయ కలయిక సమావేశంలో నిర్వహించారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు గుండాల ఈశ్వరయ్య మాదిగ, టీడీపీ ఎస్సీసెల్ అధికార ప్రతినిధి గంధం శ్రీని వాసులు, ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఉంగరాని గుండ్ల రాముడు, కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి, ఆవులదొడ్డి సర్పంచ్ మద్దయ్య, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గృహాలకు దరఖాస్తు చేసుకోవాలి

చాగలమర్రి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని పేదలు ప్రభుత్వ గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ నరసింహరావు, సహాయ అధికారి ఓబులేసు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన పథకం కింద ప్రభుత్వం గృహాలు మంజూరయ్యాయని అన్నారు. లబ్ధిదారులు కుటుంబంలోని భార్య, భర్త ఆధార్‌కార్డు, జాబ్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా, ఫొటోలతో హౌసింగ్ కార్యాలయంలో సంబంధిత సచివాలయాలలో దరఖాస్తులు అందజేయాలని వారు కోరారు. జగనన్న లేఔట్‌లలో గృహాలను లబ్ధిదారులు వేగవంతం చేసుకోవాలని, డిసెంబరు నాటికి గృహాలు పూర్తి చేసుకోవాలని అన్నారు.

సాగునీటి సంఘం ఎన్నికల నిర్వహణకు కసరత్తు

ఉయ్యాలవాడ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 8న జరిగే సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఎన్నికల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తొమ్మిది సంఘాలకు ఎన్నికలు ఉంటాయన్నారు. ఈ సంఘాలకు ఎన్నికల అధికారులను నియమిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమహేశ్వరరావు, ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి ఉన్నారు.

రుద్రవరం : డిసెంబరు 8న నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నట్లు తహసీల్దారు మల్లికార్జునరావు గురువారం తెలిపారు. రుద్రవరం మండలంలో 16 చెరువులకు 13 తెలుగుగంగ మొత్తం 39 నీటి సంఘాలకు ఎన్నికలు ఉంటాయని ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నట్లు తహసీల్దారు తెలిపారు.

వరిపంట కోత ప్రయోగం

చాగలమర్రి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిగనూరు గ్రామంలో రైతులు పండించిన వరి పంటపై గురువారం ఏవో రంగనేతాజీ పర్యవేక్షణలో వ్యవసాయ సిబ్బంది పంటకోత ప్రయోగం చేశారు. గ్రామంలోని రామచంద్రయ్య సాగు చేసిన వరిపంట పొలంలో పంట కోత ప్రయోగం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పూలేకు నివాళి

డోన్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మండల కార్యదర్శి శ్రీనవాసులు యాదవ్, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి గుండాల ఈశ్రవయ్య, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు గంధం శ్రీనివాసులు, కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వకర్త గార్లపాటి మద్దిలేటి పాల్గొన్నారు. అలాగే వైసీపీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జడ్పీటీసీ బద్దెల రాజ్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్ సోమేష్ యాదవ్, కురుకుంద హరి పాల్గొన్నారు.



డోన్‌లో పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



చాగలమర్రిలో పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

చాగలమర్రి: పట్టణంలోని మల్లేవేముల బస్టాండు సమీపంలోగల బీసీ సంఘం కార్యాలయంలో బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రామతీర్థం, పీరయ్య, చిన్నికృష్ణ, రమణ, సుబ్బరాయుడు, ప్రతాప్‌రెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

బేతంచెర్ల : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఇక్కడ సమాజంలోని మహిళలు, బాలికల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించిన మహోన్నత వ్యక్తి పూలే అని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. గురువారం బేతంచెర్ల పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముర్తుజావలి, చంద్రారెడ్డి, లక్ష్మిరెడ్డి, ఖాజా, తిరుమలేశ్వరరెడ్డి, పీఏ తిమ్మయ్య, వైస్ చైర్మన్ నాగం వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పని వేళలు పాటించాలి



గ్రామ సచివాలయం తనిఖీ చేస్తున్న ఈవోఆర్డీ సతీష్‌రెడ్డి

బనగానపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సచివాలయం సిబ్బంది పని వేళలు పాటించాలని ఈవోఆర్డీ సతీష్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని మీరాపురం, పాతపాడు, యాగంటిపల్లె గ్రామ సచివాలయాలను ఈవోఆర్డీ తనిఖీ చేశారు. ఆయా గ్రామాల సమస్యలు తెలుసుకున్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. వాతావరణమార్పుల దృష్ట్యా జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, గ్రామంలో మురుగుకాల్వలు శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష వసతి

కొలిమిగుండ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 30నుంచి జనవరి-13 వరకు భిక్ష వసతి ఏర్పా టు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం వెల్లడించారు. దాతల సహకారంతో అయ్యప్ప మాలాధారులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప స్వాములు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

కొలిమిగుండ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు గురువారం తెలిపారు. అవుకు మండలం కొండమనాయినిపల్లె గ్రామానికి చెందిన గోపాలక్రిష్ణ పేట్నీకోట గ్రామం నుంచి 44 బస్తాలు రేషన్ బియ్యాన్ని మినీ వ్యాన్‌లో యాడికి మండలానికి తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు కొలిమిగుండ్ల సీఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎస్పీని కలిసిన జేఏసీ నాయకులు

కోవెలకుంట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణాను నంద్యాల జిల్లా జేఏసీ అధ్యక్షుడు దేవరాజ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. డిసెంబరు 3న నిర్వహించనున్న దివ్యాంగుల దినోత్సవానికి ముఖ్య అతిథి గా హాజరుకావాలని ఆయన కోరారు. ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు దేవరాజ్ తెలిపారు.

సింహగర్జనను జయప్రదం చేయండి

కోవెలకుంట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో డిసెంబరు 1న నిర్వహించనున్న మాలల సింహ గర్జన సభను జయప్రదం చేయాలని మాల మహానాడు రాష్ట్ర నాయకులు ఆవుల దేవరత్నం, కోగిల ప్రసాద్, సుబ్బరాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు బెల్లం రాజ్‌కుమార్, కడియం సాంబశివుడు, పుల్లయ్య, భాస్కర్, శేఖర్, ఇస్మాయిల్, మర్ర పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చాగలమర్రి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం చాగలమర్రి పీఆర్టీయూ కార్యాలయంలో మండల కార్యవర్గం ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా మౌలాలి, కార్యదర్శిగా ఆంజనేయరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు దాదాపీర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, మహిళా ఉపాధ్యక్షులు సుధాకుమారి, మహిళా కార్యదర్శి రెహెనా, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, జైలాబ్దిన్, సభ్యులను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని ఆచరించాలి

ప్యాపిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హిందువులు సనాతన ధర్మాన్ని ఆచరించాలని ప్రముఖ ధార్మిక ప్రవచనకర్త తొగటి సురేష్‌బాబు అన్నారు. స్థానిక ఈశ్వరస్వామి ఆలయంలో టీటీడీ హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రవచనాల కార్యక్రమం నిర్వహించారు. నాయకులు దేవీదయానంద్‌సింగ్, నరేష్, రామాంజినేయులు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

హైందవ ధర్మాన్ని పరిరక్షించాలి

శిరివెళ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : హైందవ ధర్మాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని విశ్వ హిందూ పరిషత్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు వైవీ రామయ్య పిలుపునిచ్చారు. మండలంలోని గోవిందపల్లె రామాలయంలో నిర్వహించిన సమావేశంలో హైందవ శంఖారావం కరపత్రాలను గురువారం విడుదల చేశారు. శిరివెళ్ల ప్రఖండలోని మహానంది కండలో ఉన్న ఏడు ఉప మండలాల్లో డిసెంబరు 1న హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో నడిపి సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, కమతం రాజశేఖర్‌రెడ్డి, నాగమల్లేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వంశీధర్

శిరివెళ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని శిరివెళ్ల సర్కిల్ సీఐ వంశీధర్ సూచించారు. మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్, సైబర్ సెక్యూరిటీపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎస్ఐ చిన్న పీరయ్య, కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ కృష్ణమూర్తి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, సైబర్ సెక్యూరిటీ కన్వీనర్ సంజయ్ కుమార్, యర్రగుంట్ల పీహెచ్‌సీ ఎంపీహెచ్‌వో నాగార్జునరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు శంకుస్థాపన

ప్యాపిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రూ.40లక్షలతో పోస్టల్ కార్యాలయం కొత్త భవనాన్ని నిర్మించనున్నట్లు డోన్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మౌలేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పోస్టల్ కార్యాలయంలో ఆయన సిబ్బంది, గ్రామస్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం భవన నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. క్యాక్రమానికి పోస్టల్ ఉన్నతాధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

యర్రగుంట్లలో ఆధార్ సేవలు

శిరివెళ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రగుంట్ల గ్రామంలోని సచివాలయం-2లో ఆధార్ సేవలు అందిస్తున్నట్లు ఈవోపీఆర్డీ శ్రీనివాస శర్మ గురువారం తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా సంబంధిత ధృవీకరణ పత్రాలను తమ వెంట తీసుకురావాలని ఈవోపీఆర్డీ సూచించారు.